క్లుప్తంగా

'ఆదర్శ'లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

కుంటాల: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 2025–26లో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థుల కోసం గడువు తేదీని ఈనెల 20వరకు పెంచినట్లు ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ తెలిపారు. ఎంఈసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని.. విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం లేదన్నారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు హుండీ లెక్కింపు

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన అడెల్లి మహాపోచమ్మ ఆలయ హుండీ ఆదాయం శుక్రవారం లెక్కించనున్నట్లు ఈఓ రమేశ్ ఒక ప్రకటలో తెలిపారు. ఉదయం 10గంటలకు ఆయా గ్రామాల మహిళా భక్తులు హుండీ ఆదాయం లెక్కింపునకు స్వచ్ఛందంగా హాజరతారని పేర్కొన్నారు. కార్యక్రమానికి మండల నాయకులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఉద్ధమ్‌సింగ్‌కు నివాళి

తానూరు(ముధోల్): ముధోల్ శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో గురువారం స్వాతంత్ర్య సమరయోధుడు ఉద్ధమ్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. ప్రార్థన వేళ ఉద్ధమ్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల సమితి కార్యదర్శి ధర్మపురి సుదర్శన్, విశ్రాంతి ఉపాధ్యాయుడు భగవాన్ దాస్, హెచ్‌ఎం సారథిరాజు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కుంటాల: మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం అశోక్ పేర్కొన్నారు. గురువారం మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సమాఖ్య సమావేశంలో మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు బత్తుల కరుణ, కార్యదర్శి సురేఖ, కోశాధికారి కవితాబాయి, సీసీలు పెంటన్న కవిత, యూసుఫ్, కంప్యూటర్ ఆపరేటర్ శివప్రసాద్, వీవోఏలు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

లోకేశ్వరం: మండలకేంద్రంలోని ఎస్సీ వసతిగృహంలో విద్యార్థులకు గురువారం లోకేశ్వరం పీహెచ్‌సీ సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా పలువురి రక్తన మూనాలు సేకరించారు. పరీక్షల ఫలితాల ఆధారంగా అవసరమైన వారికి మందులు, చికిత్స అందిస్తామని సిబ్బంది పేర్కొన్నారు. వార్డెన్ సుజిత్‌రెడ్డి, డీఎంఎల్ టీ మహేశ్, ఆరోగ్య కార్యకర్త మరియా ఉన్నారు.

ఎంపీడీవోగా సోలామన్‌రాజ్

లోకేశ్వరం: నూతన ఎంపీడీవోగా సోలామన్ రాజ్ గురువారం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్క డ ఎంపీడీవో పనిచేసిన వెంకట రమేశ్ మళ్లీ సూపరిటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. సోలామన్‌రాజ్ ఈ మండలంలోనే ఎంపీవోగా పని చేశారు.

బాధిత కుటుంబానికి సాయం

కడెం: మండలంలోని అంబారిపేట్ గ్రామానికి చెందిన బాల రాజవ్వ ఇటీవల అనారోగ్యంతో మరణించింది. అంబారిపేట్ గల్ఫ్ బిడ్డలు వాట్సాప్ గ్రూప్ సభ్యులు జమ చేసిన రూ.10500లను గురువారం గ్రామస్తులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. రెంకల రాజన్న శంకర్, నారాయణ, రాజన్న, వెంకటేశ్, రమేశ్ తదితరులున్నారు.

సాగుకు ముందుకురావాలి

భైంసారూరల్: ఆయిల్‌పాం సాగుకు రైతులు ముందుకురావాలని ఉద్యానశాఖ అధికారి జావిద్ పాషా అన్నారు. మండలంలోని కామోల్ గ్రామంలో గురువారం ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. నాలుగేళ్లపాటు ఎకరాకు రూ.4200, బిందుసేద్యం పరికరాలను రాయితీపై ప్రభుత్వం అందిస్తుందని.. ఆసక్తి కల్గిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏఈవో రాజు, భైంసా ఆయిల్‌పామ్ ఏరి యా మేనేజర్ శేఖర్, శివాజీ తదితరులు ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

పెంబి: ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం పెంబి గిరిజన ఆశ్రమ పాఠశాలలో లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించగా ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని.. అపరిచితులు ఫోన్ చేసి ఓటీపీలు అడిగితే చెప్పవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీడీవో అంబాజీ, పలువురు నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

5 ఎకరాలు.. వేల మొక్కలు

- చిట్టడవిని తలపిస్తున్న సూర్యాపూర్ బృహత్ ప్రకృతి వనం
- ఆహ్లాదం పంచుతున్న పచ్చదనం
- చుట్టూ కంచెలు ఏర్పాటు



సూర్యాపూర్ బృహత్ ప్రకృతి వనంలో పెరుగుతున్న పండ్ల మొక్కలు

కుంటాల: పచ్చదనం పెంచి ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు గత ప్రభుత్వం మండలానికో బృహత్ ప్రకృతివనానికి శ్రీకారం చుట్టింది. ఐదు నుంచి పదెకరాల విస్తీర్ణం ఉండే ఈ వనంలో అన్ని రకాల మొక్కలు నాటి సంరక్షించాలని నిర్ణయించారు. కొన్నిచోట్ల నిర్వహణను గాలికొదిలేయడంతో వనంలో మొక్కలు ఎండిపోయాయి. నాటిన మొక్కలను అధికారులు, సిబ్బంది కంటికి రెప్పలా కాపాడటంతో కుంటాల మండలంలోని సూర్యాపూర్ మినీ బృహత్ ప్రకృతివనంలో పచ్చదనం వెల్లువిరుస్తోంది. ఇక్కడి వచ్చిన వారు ఈ వనాన్ని చూసి పరవశించిపోతున్నారు.

మొదట 500 మొక్కలు..

మండలంలోని సూర్యాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన బృహత్ పల్లె ప్రకృతి వనంలో పండ్ల మొక్కలను నాటాలని అధికారులు చర్యలు చేపట్టారు. 2023లో మొదటిసారి కానుగ, వేప, నిమ్మ తదితర మొక్కలను ఐదు వందల వరకు నాటించారు. అవి ఏపుగా పెరిగాయి. దీంతో ఐదు ఎకరాల్లో 5 వేల పండ్ల మొక్కల పెంపకం చేపట్టారు. ఇందులో జామ, బొప్పాయి, నిమ్మ, అల్లనేరేడు, సీతాఫలం తదితర మొక్కలను పెంచుతున్నారు. సుమారు 4 వేల జామ మొక్కలు ఏపుగా పెరిగి మరో ఆరునెలల్లో పండ్లనిచ్చే దశకు చేరుకున్నాయి. ఇటీవల ఈ బృహత్ వనాన్ని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అధికారులు సందర్శించారు. మొక్కలు పెంచుతున్నందుకు గాను పంచాయతీ కార్యదర్శి రాజును ప్రత్యేకంగా అభినందించారు.

సంరక్షణకు ప్రత్యేక చర్యలు..

బృహత్ పల్లె ప్రకృతి వనంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు పంచాయతీ, ఈజీఎస్ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. రోజు రెండు పూటల మొక్కలకు నీటిని పట్టిస్తున్నారు. పశువులు లోనికి రాకుండా, కోతుల బెడద లేకుండా చుట్టూ కంచెలు ఏర్పాటు చేశారు. ఈ వనంలో ఓ మంచెను సైతం ఏర్పాటు చేశారు.



వనంలో నాటిన బొప్పాయి మొక్కలు

కంటికి రెప్పలా కాపాడుతున్నాం..



బృహత్ పల్లె ప్రకృతి వనంలో మొదటగా 500 మొక్కలు నాటాం. ప్రస్తుతం 5వేల వరకు పెంచి వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. మరో రెండు, మూడు నెలల్లో పండ్లు కాసే అవకాశం ఉంది. రోజు నీళ్లు పడుతూ కంటికి రెప్పలా కాపాడుతున్నాం.

– రాజు, పంచాయతీ కార్యదర్శి, సూర్యాపూర్

పంచాయతీకి ఆదాయం..



పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం కోసం సూర్యాపూర్ బృహత్ పల్లె ప్రకృతి వనంలో నాటిన మొక్కలు సత్ఫలితాన్నిచ్చాయి. మొక్కలకు పెరిగిన కాయలను అమ్మడం ద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం సమకూరుతుంది.

– గట్టుపల్లి నవీన్, ఏపీవో, కుంటాల

ఈ బురద రోడ్లపై వెళ్లేదెలా?



బీఎస్ మార్ట్ ఎదుట బురద రోడ్డు



తహసీల్దార్ కార్యాలయం పక్కన రోడ్డు దుస్థితి

లక్ష్మణచాంద: చిన్నపాటి వర్షానికే మండలకేంద్రంలోని రోడ్లు బురదమయంగా మారాయి. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలతోపాటు ప్రధాన కూడళ్ల వద్దకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎక్కడికక్కడ నీరు నిలువడంతో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. బురద తొలగించి పరిసరాలను శుభ్రం చేయాలని వేడుకుంటున్నారు.

అమ్మ పాలే అమృతం

- ముర్రుపాలలో పోషకాలు మెండు
- నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు
- వారంపాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు

నిర్మల్‌చైన్‌గేట్: ఏటా ఆగస్టు 1 నుంచి 7 వరకు తల్లి పాల వారోత్సవాలు నిర్వహిస్తారు. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు అందించేలా తల్లులకు సాయం చేయడం ఈ వారోత్సవాల లక్ష్యం. తల్లి పా లు శిశు ఆరోగ్యానికి అమృతం, సహజ రోగని రోధక శక్తిని అందిస్తాయి. ఈ పాలలో పోషకాలు, విటమిన్లు, లాక్టోజ్ ఉండటం వల్ల శిశు పెరుగుదలకు, మెదడు చురుకుదనానికి, జ్ఞాపకశక్తి పెరుగుదలకు దోహదపడతాయి. ఆరు నెలల పాటు రోజుకు 12 సార్లు పాలు తాగించాలని వైద్యులు సూచిస్తున్నారు.

ప్రయోజనాలు..

తల్లిపాలు శిశువుకు ప్రోటీన్లు, కాల్షియం, విటమిన్లు అందించి రక్తహీనత, అంటువ్యాధుల నుంచి కాపాడతాయి. నిమోనియా, డయేరియా, క్యాన్సర్, గుండె జబ్బులు, ఆస్తమా, డయాబెటిస్ వంటి వ్యాధులను నివారిస్తాయి. స్థూలకాయం, పోషకాహార లోపం తగ్గించి శిశు మరణాలను అరికడతాయి. డబ్బా పాలకు బదులు తల్లిపాలు తప్పనిసరని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

అవగాహన కార్యక్రమాలు..

జిల్లాలో మండలాలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. గర్భిణులకు జాగ్రత్తలు, బాలింతలకు కౌన్సెలింగ్ అందిస్తారు. అంగన్‌వాడీ సి బ్బంది ఇంటింటికీ తిరిగి 7–24 నెలల పిల్లలకు పోషకాహారం ఇవ్వాలని సూచిస్తారు. తల్లిపాల ప్రాధాన్యం, శిశు ఎదుగుదలపై వివరిస్తారు.

అవగాహన కల్పిస్తాం



బిడ్డకు సరిపడా పాలు ఉండాలంటే గర్భంతో ఉన్నప్పటి నుంచే తల్లి పౌష్టికాహారం తీసుకోవాలి. ప్రోటీన్లు ఉండే పాలు, చేపలు, గుడ్లు, పండ్లు, ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలి. ఏడు రోజులు తల్లి ఆవశ్యతకపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తాం.

– ఫైజాన్ అహ్మద్, ఇన్‌చార్జి సంక్షేమ అధికారి

ముర్రుపాలతో బిడ్డకు క్షేమం



బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు కచ్చితంగా పట్టించాలి. మొదటగా వచ్చే పాలను ముర్రుపాలు అంటారు. దీంతో బిడ్డకు కావాల్సిన పోషకాలు అంది వెచ్చదనం, రోగనిరోధక శక్తి లభిస్తుంది. మొదటి ఆరు నెలలు బిడ్డకు తల్లిపాలు మాత్రమే పట్టించాలి.

– డాక్టర్ గౌతమ్, చిన్నపిల్లల వైద్యులు

ధ్రువపత్రాల్లేకుంటే వాహనాలు సీజ్

- కార్డెన్‌సెర్చ్‌లో ముధోల్ సీఐ మల్లేశ్



మాట్లాడుతున్న ముధోల్ సీఐ మల్లేశ్

తానూరు: సరైన ధ్రువపత్రాలు లేకుంటే వాహనాలను సీజ్ చేస్తామని ముధోల్ సీఐ మల్లేశ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని జౌలా(బి) గ్రామంలో గురువారం తెల్లవారుజామను కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తానూరు, ముధోల్, లోకేశ్వరం, బాసర ఎస్సైలతో పాటు 20 మంది పోలీసులు గ్రామంలోని వీధులవారీగా తనిఖీలు నిర్వహించారు. ఇళ్ల ఎదుట నిలిపి ఉంచిన బైక్‌లు, ఆటోల ధ్రువపత్రాలు యజమానులను అడిగి పరిశీలించారు. ఈసందర్భంగా సరైన పత్రాల్లేని 44 బైక్‌లు, 4 ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడారు. నేరాలను నియంత్రించి శాంతిభద్రతలపై ప్రజలకు భరోసా కల్పించేందుకే కార్డెన్‌సెర్చ్ చేపట్టినట్లు పేర్కొన్నారు. మద్యం తాగి నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణదారులు వీడీసీ ఆధ్వర్యంలో వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎస్సై షేక్ జుబేర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులు జ్ఞానం పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఎంఈవో అశోక్‌వర్మ

లక్ష్మణచాంద: విద్యావ్యవస్థలోవస్తున్న మార్పులను పరిశీలిస్తూ జీవశాస్త్ర ఉపాధ్యాయులు జ్ఞానం పెంచుకొని డిజిటల్ పాఠాలు బోధించాలని ఎంఈవో అశోక్ వర్మ పేర్కొన్నారు. గురువారం మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లక్ష్మణచాంద, మామడ, దిలావర్‌పూర్, నర్సాపూర్ (జి) మండలాల్లోని ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత, కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో జీవశాస్త్రం బోధించే ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ, ఆర్పీ లక్ష్మారెడ్డి మాట్లాడారు. యాక్షన్ ప్లాన్ తయారు చేసుకొని విద్యార్థులను సంసిద్ధత ప్రోగ్రాం ద్వారా ఉత్తమంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ డిజిటల్ బోధన జరపాలని సూచించారు. బాలశక్తి కార్యక్రమాన్ని ప్రతి పాఠశాలలో అమలయ్యేలా చూడాలని కోరారు. మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించాలని అన్నారు. సమావేశంలో రిసోర్స్ పర్సన్లు గంగాసురేశ్, సుదర్శన్, సీఆర్పీ సుధాకర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డు పత్రాలు పంపిణీ



రేషన్‌కార్డు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామారావు



కడెం: పత్రాలు పంపిణీ చేస్తున్న చైర్మన్ భూషణ్

బాసర: నూతన రేషన్‌కార్డులను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. గురువారం బాసర రైతు వేదికలో ఎమ్మెల్యే 584 నూతన రేషన్ కార్డు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పవన్ చంద్ర, ఎంపీడీవో దేవేందర్, ఇతరశాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కడెం:పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఏఎంసి చైర్మన్ పడిగెల భూషణ్ అన్నారు. గురువారం మండలంలోని ఎలగడప గ్రామంలో 170 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మహమ్మద్ సలీం, గంగన్న, భూమేశ్, కోల శ్రీను, రహీం, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఆలయాల నిర్మాణానికి రూ.2.4 కోట్లు మంజూరు

భైంసాటౌన్: నియోజకవర్గంలో పలు ఆలయాల నిర్మాణానికి రూ.2.40 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ తెలిపారు. కుభీర్ మండలం పార్డి (కె)లో రాజరాజేశ్వర ఆలయానికి రూ.30 లక్షలు, లోకేశ్వరం మండలం రాజురలో రామాలయానికి రూ.50 లక్షలు, కుంటాల మండలం లింబా(బి)లో శివాలయానికి రూ.12 లక్షలు, తానూరు మండలంలోని మొగిలిలో కృష్ణ మందిరానికి రూ.40 లక్షలు, మహాలింగిలో మహాలక్ష్మి ఆలయానికి రూ.30 లక్షలు, తానూరులో పెద్దమ్మతల్లి ఆలయానికి రూ.30 లక్షలు, భైంసా మండలం కుంసరలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి రూ.12 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈనెల 12న టెండర్ల ప్రక్రియ అనంతరం పనులు ప్రారంభమవుతాయన్నారు. నిధులు మంజూరు చేయడంపై సీఎంతోపాటు, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు అడెల్లి ఆలయ దుకాణ సముదాయాల వేలం

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించే వివిధ దుకాణ సముదాయాల నిర్వహణకు శనివారం బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రమేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ పరిసరాల్లో కొబ్బరి కాయలు విక్రయించే హక్కు, టోల్‌ట్యాక్సు వసూలు, బొమ్మలు, కంకణాలు, సీడీలు విక్రయించుకునే హక్కు, ప్యాలాలు, పుట్నాలు విక్రయించుకునే హక్కు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునే హక్కు, పూలదండలు, చీరలు విక్రయించుకునే హక్కు తదితర దుకాణ సముదాయాలకు వేలంపాటలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కల్గిన వ్యాపారులు దరావత్తు సొమ్ము ఈనెల2 (శనివారం)ఉదయం 10గంటల్లోపు చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

వృత్తివిద్యా కోర్సులు ప్రారంభం

కుంటాల: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం వృత్తి విద్యా కోర్సులు ప్రారంభమయ్యాయి. విద్యార్థినుల కోసం ఐటీ, ఐటీఈఎస్, బ్యూటీ, వెల్‌నెస్ కోర్సులను ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ తెలిపారు.

సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠాపన

లోకేశ్వరం: మండలంలోని కిష్టాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో గురువారం సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని 21 మంది దాతలు రూ.1లక్ష 50 వేలతో విగ్రహం ప్రతిష్ఠించారు. వేదమంత్రాల నడుమ జరిపిన ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం భారతి, పలువురు గ్రామస్తులు ఉన్నారు.

ఆలయంలో పూజలు

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామ అంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో భాగంగా గురువారం పూజాది కార్యక్రమాలు, అభిషేకాలు, మంత్రహవనం తదితర కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో గుగ్లావత్ సురేశ్, బొమ్మెల శంకర్, నామెడ ధర్మరాజు, గంగారాం, రాజేశ్వర్, నవీన్, శ్రీనివాస్, సంతోశ్, శివ తదితరులు ఉన్నారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన

కుంటాల: రాష్ట్ర ప్రభుత్వం గత నెల 29వ తేదీ నుంచి కొత్త విధానం ద్వారా ఆసరా పింఛన్లను అందిస్తుందని ఎంపీడీవో అల్లాడి వనజ పేర్కొన్నారు. గురువారం కుంటాలలో నూతన విధానం(ఫేస్ రికగ్నైజేషన్ యాప్) ద్వారా అందిస్తున్న పింఛన్లను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్పీఎం ఆనంద్‌రావు, పంచాయతీ కార్యదర్శి రాజబాపు, సిబ్బంది బాబుఖాన్ తదితరులు ఉన్నారు.

పందిరి సాగు పరిశీలన

లక్ష్మణచాంద: నిజామాబాద్ జిల్లా వర్నీ మండలం శ్రీనగర్ గ్రామంలో పందిరి విధానంలో సాగు చేస్తున్న పంటలను గురువారం మండలంలోని రైతులు పరిశీలించారు. మునగ, కాకర, దొండ వంటి పంటలను పరిశీలించి..సాగు విధానం, ఖర్చుల వివరాలను అక్కడి రైతులను అడిగి తెలుసుకున్నారు. సురకంటి ముత్యంరెడ్డి, బుర్రి భూమేశ్, ప్రభాకర్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

బాబా ఆలయంలో సందడి

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. మధ్యాహ్న హారతిలో భక్తులు తరలివచ్చి బాబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్ ఎస్‌లో గురువారం ఫిర్యాదులు, సలహాల పెట్టె ఏర్పాటు చేసినట్లు హెచ్‌ఎం నరేందర్‌రావు తెలిపారు. పాఠశాలలో సమస్యలుంటే విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు లేఖలు రాసి ఫిర్యాదుల పెట్టెలో వేయాలని సూచించారు.

అమ్మలా కలెక్టర్..



నిర్మల్‌లోని అంబేడ్కర్ భవనంలో గురువారం ప్రారంభించిన ఆకాంక్ష హాత్ కార్యక్రమానికి పలువురు హాజరయ్యారు. పెంబి మండలం మందపల్లి గ్రామానికి చెందిన రోజా తన బిడ్డను ఎత్తుకొని వేదికపై తన అనుభవం చెబుతుండగా.. ఆ చిన్నారి మైకును లాగేసుకుంది. కలెక్టర్ అభిలాష అభినవ్ ఆ పాపను ఎత్తుకుని ఇలా లాలించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

కోతి చేష్టలతో తెగిన కరెంట్ తీగలు

- తప్పిన ప్రమాదం, సరిచేసిన విద్యుత్ సిబ్బంది



తెగిపడిన విద్యుత్ తీగలు

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి గ్రామంలో ఎస్సీ కాలనీలో గురువారం ఉదయం పెను ప్రమాదం తప్పింది. కాలనీలో ఓ స్తంభంపై కోతులు ఎక్కి బలంగా కదపడంతో కరెంట్ తీగలు తెగిపడ్డాయి. ఆసమయంలో ఎవరూ రాకపోవడంతో ప్రమాదం తప్పింది. వెంటనే రోడ్డుపై ఉన్న పలువురు ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. సమాచారం అందుకున్న ఏఈ మహేశ్.. వెంటనే గ్రామానికి జేఎల్‌ఎం నవీన్‌ను పంపి విద్యుత్ తీగలను సరిచేయించి సరఫరాను పునరుద్ధరించారు.

రైతులకు సేవలందించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఖానాపూర్: ఆత్మ నూతన చైర్మన్‌తోపాటు డైరెక్టర్లు రైతులకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏడీఏ సుజాత అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఖానాపూర్‌కు చెందిన గాడ్పు సత్యం ఆత్మ కమిటీ చైర్మన్, ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాలకు చెందిన 23 మంది డైరెక్టర్లతో కూడిన ఆత్మ కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఆధునిక సాగు పద్ధతులను రైతులకు వివరించాలని సూచించారు. సమావేశంలో టీపీసీసీ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి రాం భూపాల్, ఏఎంసీ చైర్మన్ పడిగెల భూషణ్, వైస్ చైర్మన్ ఎంఏ మజీద్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దయానంద్, చిన్నం సత్యం, అంకం రాజెందర్, పీఏసీఎస్ చైర్మన్లు ఆమంద శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, పెంబి మండలాధ్యక్షుడు స్వప్నిల్ రెడ్డి, నూతన డైరెక్టర్లు తదితరులున్నారు.

షరతులు లేని జీవన భృతి అమలు చేయాలి

- టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాజన్న



జిల్లా కేంద్రంలో ధర్నా చేస్తున్న బీడీ కార్మికులు

నిర్మల్‌చైన్‌గేట్: బీడీ పరిశ్రమలో పని చేసే కార్మికులకు షరతులు లేకుండా జీవన భృతి అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్క ర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాజన్న మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న బీడీ రోలర్స్, ప్యాకర్స్, నెలసరి ఉద్యోగులకు జీవన భృతి అందించాలన్నారు. 2014, ఫిబ్రవరి 28 నాటికి మన జిల్లాలో 63 వేల మంది బీడీ కార్మికులు మాత్రమే జీవన భృతి పొందుతున్నారని, ఇంకా 40 వేల మందికి అందడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం బీడీ పరిశ్రమపై ఆంక్షలు విధిస్తూ బీడీ కట్టపై పుర్రె ఎముకల గుర్తు ముద్రించడం, 28 శాతం జీఎస్టీ విధించడంతో బీడీ పరిశ్రమ రోజురోజుకు క్షీణిస్తోందన్నారు. నెలకు 8 రోజులే పని దొరుకుతుందని వాపోయారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం చేయూత పథకం ద్వారా రూ.4 వేల జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు బక్కన్న, జిల్లా కార్యదర్శి ఆర్.రామలక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కె.లక్ష్మి, టీయూసీఐ జిల్లా నాయకులు రేష్మ, ముత్తక్క, గంగామణి సరస్వతి, పుష్ప, కవిత, పద్మ పాల్గొన్నారు.